# బలగం TV BALAGAM

నిజమే మా బలం.. ప్రజలే మా బలగం

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 25 అక్టోబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 5


## బాణాసంచా దుకాణాలకు ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి

బలగం టీవీ, హైదరాబాద్

దీపావళి పండుగ సందర్భంగా నగరంలో పటాకుల విక్రయాలపై జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి కీలక ప్రకటన చేశారు. క్రాకర్స్ విక్రయించే దుకాణదారులు ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. రిటైల్ దుకాణాలకు రూ.11 వేలు, హోల్ సేల్ దుకాణాలకు రూ.66 వేలు నిర్ణయించినట్లు వెల్లడించారు.దుకాణాలు ఏర్పాటు చేయాలనుకునే వారంతా నిర్ణీత ఫీజును చెల్లించి జీహెచ్ఎంసీ నుంచి ముందస్తు అనుమతి పొందాల్సి ఉంటుందని పేర్కొన్నారు. తాత్కాలిక ట్రేడ్ ఐడెంటిఫికేషన్ నెంబర్ కోసం సిటిజన్ సర్వీస్ సెంటర్, జీహెచ్ఎంసీ వెబ్ సైట్ www.ghmc.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఇక, తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి జారీ చేసిన ఉత్తర్వులు, న్యాయస్థానాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉత్తర్వులను కచ్చితంగా పాటించాలని సూచించారు. కొన్ని టపాసుల అమ్మకాలపై నిషేధం ఉందని.. వాటిని అమ్మకూడదని అన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన దుకాణదారుల తాత్కాలిక ట్రేడ్ లైసెన్స్ సర్టిఫికెట్ రద్దు చేస్తామని హెచ్చరించారు.

# ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి సిద్ధం



- డిప్యూటీ సీఎం నేతృత్వంలో కేబినేట్ సబ్ కమిటీ ఏర్పాటు
- దీపావళి తర్వాత శాఖల వారిగా ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో భేటీ
- నేడు సాయంత్రంలోగా డీఏ చెల్లింపుపై నిర్ణయం

బలగం టీవీ, హైదరాబాద్

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఉద్యోగుల జేఏసీ ప్రతినిధులతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు తో కలిసి సీఎం సమావేశమయ్యారు.ఉద్యోగుల డీఏ చెల్లింపు విషయంపై శుక్రవారం సాయంత్రంలోగా నిర్ణయం ప్రకటిస్తామని ముఖ్యమంత్రి చెప్పారు.ఉద్యోగులకు సంబంధించి వివిధ సమస్యల పరిశీలన కోసం కేబినేట్ సబ్ కమిటీని నియమించారు. ఉప ముఖ్యమంత్రి నేతృత్వంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారు, పొన్నం ప్రభాకర్ గారు సభ్యులుగా కేశవరావు ప్రత్యేక ఆహ్వానితులుగా కేబినేట్ సబ్ కమిటీని ఏర్పాటు చేశారు.

దీపావళి తర్వాత శాఖల వారిగా ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో కేబినేట్ సబ్ కమిటీ సమావేశమవుతుంది.జీవో 317 పై మంత్రివర్గ ఉపసంఘం ఇప్పటికే సమర్పించిన నివేదికపై కేబినేట్ సమావేశంలో నిర్ణయం తీసుకుంటారు.జేఏసీ ప్రతినిధులతో జరిగిన సమావేశాల్లో ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ు, ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు.

తమది ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వమని ఈ సందర్భంగా సీఎం పునరుద్ఘాటించారు. రెండేళ్ల నుంచి పెండింగులో ఉన్న అయిదు డీఏలు విడుదల చేయాలని ఉద్యోగ సంఘాల నేతలు సీఎంను కోరారు. పెండింగులో ఉన్న బిల్లులను క్లియర్ రద్దు, ఈ–కుబేర్ వ్యవస్థ రద్దు, ఉద్యోగులు, పెన్షనర్ల సమాన వాటాతో ఈహెచ్ఎస్ అమలు చేయాలని కోరారు.

సీపీఎస్, యూపీఎస్ వద్దని.. పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలని, జీవో 317 ప్రకారం బాధితులు కోరుకున్న చోటుకు బదిలీ చేయాలని ఉద్యోగ సంఘాల నేతలు ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

# రూ.650 కోట్లతో రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్




- 5 వందే భారత్ రైళ్లను అడిగాం
- రూ.430 కోట్లతో చర్లపల్లి రైల్వే టెర్మినల్ పూర్తయ్యింది
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

బలగం టీవీ, హైదరాబాద్

తెలంగాణలో రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ ఏర్పాటు చేయనున్నట్టు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రకటించారు. రూ.650 కోట్లతో వరంగల్‌లో త్వరలోనే.. రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నట్టు చేప్పారు. హైదరాబాద్ రైల్ నిలయంలో.. దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్, దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని తెలంగాణ, కర్ణాటక ఎంపీలతో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి గురువారం సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ దేశంలోనే సౌత్ సెంట్రల్ రైల్వేలో పనులు అతివేగంగా జరుగుతున్నాయని తెలిపారు. కొత్త రైల్వే లైన్లు, డబ్లింగ్ లైన్‌లు ఎలక్ట్రిఫికేషన్ పరిధిలో జరగుతున్ననాయని చెప్పుకొచ్చారు. వరంగల్‌లో ఏర్పాటు చేయబోయే మ్యానుఫ్యాక్చర్ యూనిట్‌లో.. రైల్వే వ్యాగన్లు, కోచ్‌లు, ఇంజన్లు తయారు చేయాలనేదే కేంద్ర ముఖ్య ఉద్దేశమని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.తెలంగాణకు రానున్న రోజుల్లో మరో 5 వందే భారత్ రైళ్ల సంఖ్యను పెంచాలని కేంద్ర సర్కారును కోరినట్టుగా కిషన్ రెడ్డి తెలిపారు. దక్షిణ మధ్య రైల్వేలో చేపట్టిన.. 40 రైల్వే స్టేషన్‌ల పనులు వేగవంతంగా జరుగుతున్నాయని వివరించారు. ఈ క్రమంలోనే.. రూ.430 కోట్లతో చేపటట్టిన చర్లపల్లి రైల్వే టెర్మినల్ పూర్తయ్యిందని చెప్పుకొచ్చారు. ఎంఎంటీఎస్ లైన్ ప్రస్తుతం ఘట్కేసర్ వరకు ఉందని గుర్తు చేసిన కిషన్ రెడ్డి.. దాన్ని రాయగిరి, యాదాద్రి వరకు పొడిగించాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.

రైల్వే అభివృద్ధికి ఈ ఏడాది రూ.6 వేల కోట్ల బడ్జెట్ మంజూరైందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఆన్ గోయింగ్ వర్క్ జరుగుతున్నాయని వివరించారు. ఈ సమావేశంలో.. రాజ్యసభ సభ్యుడు సురేష్ రెడ్డి, ఎంపీలు కావ్య, రఘునందన్ రావు, డీకే అరుణ పాల్గొనగా.. ఆయా నియోకవర్గాల పరిధిలో జరుగుతున్న పనులు, చేపట్టాల్సిన రైల్వే నిర్మాణాలపై వాళ్లంతా సంతృప్తి వ్యక్తం చేసినట్టు సమాచారం.

# కాంగ్రెస్, బీజేపీ రెండూ దొందూ దొందే



- గుజరాత్ లో క్వింటాలు పత్తికి రూ. 8800 అంట. అక్కడి కన్నా నాణ్యమైన పత్తి పండించే మనకు తక్కువ ఇస్తారంట.
- సింగరేణి మీద అదానీ కన్ను
- గుజరాత్ కు ఒక నీతి, తెలంగాణకు ఒక నీతా?
- రుణమాఫీ, రైతు భరోసా, రైతు భీమా, రూ. 500 బోనస్ వచ్చే వరకు మనం పోరాటం చేయాల్సిందే.
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఆదిలాబాద్‌లో రైతు మహా ధర్నా

బలగం టీవీ, హైదరాబాద్

కాంగ్రెస్ – బీజేపీ రెండూ దొందూ దొందేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రకటించిన రూ.2లక్షల రుణమాఫీ, రైతు భరోసా సహా ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేయటం లేదని ఆరోపించారు. మాజీ మంత్రి జోగు రామన్న నేతృత్వంలో ఆదిలాబాద్‌లోని రాంలీల మైదానంలో బీఆర్ఎస్ ఏర్పాటుచేసిన రైతు మహా ధర్నాలో కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఆరు గ్యారెంటీల పేరు చెప్పి అధికారపగ్గాలు చేపట్టిన కాంగ్రెస్ పార్టీ మోసాలను వచ్చే నెల మహారాష్ట్రలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. నవంబర్‌లో మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయి. ఆదిలాబాద్ వాళ్లకు అక్కడ చుట్టాలు, దోస్తులు ఉంటారు. కాంగ్రెస్ సంగతి వారికి తెలియజెప్పండి.. మేం మోసం పోయాం.. మీరు మోసపోకండి అని చెప్పండి. రైతు భరోసా, తులం బంగారం, పెన్షన్లు, స్కూటీలు అని కథలు చెప్పి ఓట్లు వేయించుకుని మోసం చేశారన్నారు. తనపై ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ పోలీసులు కేసు నమోదు చేయటాన్ని ప్రస్తావించిన కేటీఆర్.. రైతుల పక్షాన జైలుకెళ్లడానికైనా సిద్ధమేనని ప్రకటించారు. చంద్రబాబునాయుడు, వైఎస్‌రాజశేఖం రెడ్డిలతో తలపడిన తమకు ఈ చిట్టినాయుడైన రేవంత్‌రెడ్డిని ఎదుర్కోవటం ఓ లెక్కా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం చేసే అన్నీ మోసపూరిత వాగ్దానాలపై ఆదిలాబాద్‌లో ప్రారంభమైన ఉద్యమ సెగను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

అదానీ దృష్టిపడిన ఆదిలాబాద్, బెల్లంపల్లిలోని సిమెంటు పరిశ్రమలతో పాటు సింగరేణిని కాపాడుకోవటానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. గుజరాత్‌లో పత్తికి మద్దతు ధర ఇచ్చినట్టే.. తెలంగాణలో పండించిన పత్తికి కూడా మద్దతు ధర ఇవ్వాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. పత్తికి మద్దతు ధర ఇవ్వకపోతే స్థానికంగా ఉన్న బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యే వెంట పడుతాం.. వదిలిపెట్టం అని తేల్చిచెప్పారు. గుజరాత్‌లో ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పత్తి పంటకు క్వింటాల్‌కు రూ. 8800 ఇవ్వటానికి సిద్ధపడినట్లే తెలంగాణలో కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇవ్వకుంటే బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యే వెంటపడుతాం.. వదిలిపెట్టం. గుజరాత్‌కు ఒక నీతి.. తెలంగాణకు ఒక నీతి ఉంటుందా..? అని ప్రశ్నించారు.

సింగరేణి మీద అదానీ కన్ను ఉన్నదని, ఈ దొంగల నుంచి తెలంగాణను కాపాడుకోవాలంటే మనకు ఉన్న ఒకే ఒక్క శక్తి కేసీఆర్ అని స్పష్టం చేశారు. ప్రాణాలను పణంగా పెట్టి తెలంగాణను సాధించిన కేసీఆర్ నాయకత్వంలో నడుద్దాం.. ఈ దొంగల చేతి నుంచి రాష్ట్రాన్ని రక్షించుకుందామని కేటీఆర్ పిలుపునిచ్చారు.

నల్లగొండ జిల్లా రామన్నపేటలో అదానీ కొత్త సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు విషయంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. రామన్నపేట రైతులు, ప్రజలందరూ వేలాదిగా తరలివచ్చి, భారీ ర్యాలీ తీసి.. ఈ కాలుష్య పరిశ్రమ మాకొద్దు.. అదానీ ఫ్యాక్టరీ మాకొద్దు అని నినదించారు. స్థానికంగా ఉన్న సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాను కూడా అదానీకి కట్టబెడుతారు. బెల్లంపల్లి దేవాపూర్‌లోని ఓరియంటల్ ఫ్యాక్టరీ మీద కూడా అదానీ కన్ను పడ్డది. దాన్ని అదానీ కొనబోతున్నాడు. దాన్ని బుక్క పెడుతడు. ఇక ఆదిలాబాద్ సీసీఐ తర్వాత సింగరేణిని కూడా బుక్క పెడుతడు. సింగరేణి మీద కూడా అదానీ కన్ను ఉన్నది అని కేటీఆర్ తెలిపారు.

ఈ కాంగ్రెసోళ్లు, బీజేపీళ్లు తోడు దొంగలు. మోదీని రాహుల్ గాంధీ దొంగ అంటడు. మోదీని బడేబాయ్ అని రేవంత్ అంటడు. అదానీ మోసగాడు అని రాహుల్ అంటడు.. రేవంత్ రెడ్డి అదానీ మా దోస్తు అని అంటడు. వీళ్లంతా దందాలు చేసి.. రాష్ట్రాన్ని దోచుకుంటున్నారు. కాంగ్రెస్, బీజేపీ దొంగల నుంచి తెలంగాణను కాపాడుకోవాలంటే మనకు ఉన్న ఒకే ఒక్క శక్తి కేసీఆర్ తప్ప ఇంకెవరు దిక్కులేరు. ఎప్పటికైనా ఎన్నటికైనా ఈ రాష్ట్ర రైతాంగానికి, యువతకు, ఆడబిడ్డలకు, వృద్ధులకు శ్రీరామ రక్ష కేసీఆర్ నాయకత్వమే. బీఆర్ఎస్ పార్టీనే అండగా ఉటుంది. ప్రాణాలను పణంగా పెట్టి తెలంగాణను సాధించిన కేసీఆర్ నాయకత్వంలో నడుద్దాం.. తెలంగాణను మళ్లీ పట్టాలెక్కిదాం.. ఈ దొంగల చేతి నుంచి రాష్ట్రాన్ని రక్షించుకుందాం అని కేటీఆర్ పిలుపునిచ్చారు.

రైతుల కల్లాల వద్దకు మనమే పోదాం.. అక్కడ రైతులతో మాట్లాడి బోనస్‌పై ప్రభుత్వాన్ని నిలదీద్దాం. పత్తి కేంద్రాల వద్ద బీజేపీ నేతలను నిలదీద్దాం. బీఆర్ఎస్ అంటే భారత రాష్ట్ర సమితినే కాదు.. భారత రైతు సమితి కూడా. రైతుల పక్షాన ఉండి గట్టిగా పోరాడుతాం. ఈ ప్రభుత్వానికి సంవత్సరికం కూడా పెట్టేది ఉంది. ఇప్పుడే మొదలైంది పోరాటం. తొలిమాసిక పెట్టే రోజు వస్తది. ఈ రోజు అద్భుతంగా రైతన్న కోసం జోగు రామన్న కదిలిండు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో బ్రహ్మాండంగా కదులుతాం.. కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పేదాకా వెనుకడుగు వేసే ప్రసక్తే లేదని కేటీఆర్ స్పష్టం చేశారు.



## సుప్రీంకోర్టు నూతన సీజేఐగా జస్టిస్ సంజీవ్ ఖన్నా

బలగం టీవీ, న్యూఢిల్లీ

సుప్రీంకోర్టు నూతన ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా నియమితులయ్యారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ పదవీ కాలం నవంబర్ 10న ముగియనున్న నేపథ్యంలో తదుపరి సీజేఐగా జస్టిస్ సంజీవ్ ఖన్నా పేరును ఇప్పటికే సిఫార్సు చేసిన సంగతి తెలిసిందే. తాజాగా ఇందుకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మ ఆమోదం తెలిపారు. దీంతో భారత తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా నియామకాన్ని ధృవీకరిస్తూ కేంద్ర ప్రభుత్వం అధికారిక ప్రకటన విడుదల చేసింది. సీజేఐగా జస్టిస్ ఖన్నా పదవీకాలం నవంబర్ 11 నుంచి అమలులోకి వస్తుందని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ తెలిపారు. అదే రోజున ఆయన భారతదేశ 51వ ప్రధాన న్యాయమూర్తిగా పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆయన 2025 మే 13 వరకు అంటే దాదాపు ఏడునెలలు సీజేఐగా కొనసాగనున్నారు.

కాగా, జస్టిస్ సంజీవ్ ఖన్నా 2019 జనవరి 18న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. 1983లో ఢిల్లీ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకున్న సంజీవ్ ఖన్నా ఇక్కడి తీస్‌హజారీ జిల్లా కోర్టు, హైకోర్టు, ట్రైబ్యునళ్లలో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. 2005లో ఢిల్లీ హైకోర్టులో అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2006లో అక్కడే శాశ్వత న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. జస్టిస్ ఖన్నా ప్రస్తుతం నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా, భోపాల్‌లోని నేషనల్ జ్యుడిషియల్ అకాడెమీ పాలక మండలి సభ్యుడిగానూ ఉన్నారు.

## సింగరేణి కార్మికులకు దీపావళి బోనస్

### బోనస్ కింద రూ.358 కోట్లు విడుదల


- గత ఏడాది కన్నా ఇది రూ. 50 కోట్లు అధికం
- ఒక్కొక్క కార్మికునికి రూ.93,750 బోనస్ చెల్లింపు
- నేడు మధ్యాహ్నం కల్లా కార్మికుల ఖాతాల్లో బోనస్ జమ
- రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు

బలగం టీవీ, న్యూఢిల్లీ

దీపావళి బోనస్ గా పిలవబడే పి.ఎల్.ఆర్.ఎస్. (ప్రొడక్షన్ లింక్డ్ రివార్డ్ స్కీమ్) బోనస్ ను నేడు (శుక్రవారం) సింగరేణి కార్మికులకు చెల్లిస్తున్నట్లు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి వర్యులు మరియు ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు గురువారం సచివాలయంలో ప్రకటించారు. దీని కోసం సింగరేణి సంస్థ 358 కోట్ల రూపాయలను విడుదల చేయాలని సింగరేణి సీఎండీ ఎన్. బలరామ్ ను ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో సింగరేణిపై సమీక్ష సందర్భంగా ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. గత ఏడాది చెల్లించిన దీపావళి బోనస్ కన్నా ఇది రూ.50 కోట్లు అధికం కావడం విశేషం. శుక్రవారం మధ్యాహ్నం కల్లా దీపావళి బోనస్ ను కార్మికుల ఖాతాల్లో జమ చేయాల్సిందిగా డిప్యూటీ సీఎం శ్రీ భట్టి విక్రమార్క మల్లు స్పష్టం చేశారు. దీపావళి బోనస్ కింద ఒక్కొక్క కార్మికుడు రూ.93,750 లు అందుకోనున్నారు. దీపావళి బోనస్ సంస్థలో పనిచేస్తున్న దాదాపు 40,000 మంది కార్మికులకు వర్తిస్తుంది.జే.బీ.సీ.సీ.ఐ. విధానాల్లో భాగంగా కంపెనీలు సాధించిన ఉత్పత్తి పరిమాణం ఆధారంగా కార్మికుల శ్రమకు ప్రోత్సాహకంగా ఈ బోనస్ ను చెల్లించే పద్ధతి గత కొన్నేళ్లుగా అమలులో ఉంటోంది. ఈ ఏడాది కూడా కోల్ ఇండియా స్థాయిలో తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా దీపావళి పండుగకు ముందే చెల్లింపులు జరిగేలా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఆదేశాలిచ్చారు.

కాగా ఇటీవలే సింగరేణి ఉద్యోగులందరికీ 33 శాతం లాభాల వాటా కింద 796 కోట్ల రూపాయలను కంపెనీ పంపిణీ చేసిన విషయం తెలిసిందే. ఒక్కొక్క కార్మికుడికి సగటున 1 లక్షా 90 వేల రూపాయలు అందాయి. అలాగే ఔట్ సోర్సింగ్ సిబ్బందికి రూ.5 వేల చొప్పున చెల్లించారు. అలాగే పండుగ అడ్వాన్స్ కింద ఒక్కొక్క

మిగితా 2వ పేజీలో




## అమరావతి రైల్వే అనుసంధాన ప్రాజక్టుకు కేంద్రం ఆమోదం

### రూ.2,245 కోట్ల వ్యయంతో 57 కిలోమీటర్ల మేర రైల్వే లైన్

బలగం టీవీ, న్యూఢిల్లీ

కేంద్ర ప్రభుత్వ ఏపీకి మరో గుడ్‌న్యూస్ చెప్పింది. అమరావతి రైల్వే అనుసంధాన ప్రాజక్టుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. మొత్తం రూ.2,245 కోట్ల వ్యయంతో 57 కిలోమీటర్ల మేర రాజధాని అమరావతి కొత్త రైల్వే లైన్‌ను నిర్మించనున్నారు. ఏపీతో పాటు బిహార్ రాష్ట్రానికి కూడా కేంద్ర కేబినెట్ కీలక రైల్వే ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఏపీ రాజధాని అమరావతికి, బీహార్‌కు రెండు కీలక రైల్వే ప్రాజెక్టులు కేటాయిస్తూ కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిందని రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ ప్రకటించారు. కేంద్ర కేబినెట్ నిర్ణయాలను గురువారం ఆయన వెల్లడించారు. మొత్తం రూ.6,789 కోట్ల వ్యయంతో ఈ రైల్వే మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ఆమోదం తెలిపామని చెప్పారు.

అమరావతి నుంచి హైదరాబాద్, చెన్నై, కోల్‌కతాకు నేరుగా అనుసంధానం చేస్తూ నిర్మించనున్నారు. ఈ లైన్ ద్వారా దక్షిణ భారతదేశాన్ని మధ్య, ఉత్తరాదితో అనుసంధానం చేయడం మరింత సులువు అవుతుంది.

మిగితా 2వ పేజీలో

## జమ్మూ కశ్మీర్‌కు రాష్ట్రహోదా పునరుద్ధరించండి



- ప్రధాని మోడీతో ఒమర్ అబ్దుల్లా భేటీ

బలగం టీవీ, న్యూఢిల్లీ

జమ్మూ కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా గురువారం దేశ రాజధాని ఢిల్లీలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీని కలిశారు. ఇటీవలి ఎన్నికల్లో ముఖ్యమంత్రి అయిన తరువాత ప్రధానితో ఆయన సమావేశం కావడం ఇదే తొలిసారి. కశ్మీర్‌కు రాష్ట్ర హోదా గురించి ఈ నేపథ్యంలో ఆయన ప్రధానంగా ప్రస్తావించారు. వీరిరువురి భేటీ గురించి తరువాత అధికారిక ప్రకటన వెలువడింది. కశ్మీరీల ప్రత్యేక గుర్తింపు, వారి విశిష్టత పరిరక్షణ, రాజ్యాంగ హక్కుల పునరుద్ధరణ వంటి అంశాలను ప్రస్తావిస్తూ జమ్మూ కశ్మీర్ ప్రభుత్వం ఇటీవలే రాష్ట్రహోదా ఇవ్వాలనే డిమాండ్‌తో తీర్మానం చేసింది. దీనిని గవర్నర్ మనోజ్ సిన్హా ఆమోదించి , కేంద్రం పరిశీలనకు పంపించారు. ఈ తీర్మానం విషయం కూడా ప్రధానితో భేటీ సందర్భంగా ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది.

ఇక రెండు మూడు రోజుల క్రితమే కశ్మీర్‌లో ఉగ్రవాదుల కాల్పుల ఘటనలు చోటుచేసుకోవడం, ఓ స్థానిక డాక్టరు, ఆరుగురు స్థానికేతర వలస కూలీలు చనిపోవడం భయాందోళనలకు దారితీసింది. ఈ క్రమంలోనే ఇక్కడికి చేరిన ఒమర్ ముందుగా కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను కలిశారు. రాష్ట్ర హోదా పునరుద్ధరణ విషయాన్ని ప్రస్తావించారు. ఇందుకు కేంద్రం సుముఖంగా ఉందని, సంబంధిత ప్రక్రియ ఆరంభమవుతుందని అమిత్ షా ఒమర్‌కు హామీ ఇచ్చినట్లు కశ్మీరీ మీడియా తెలిపింది. ఆ తరువాత ఒమర్ కేంద్ర రవాణా, హైవేల మంత్రి నితిన్ గడ్కరినీ ఆయన కార్యాలయానికి వెళ్లి కలిశారు. ఆయనకు సాంప్రదాయక కశ్మీరీ శాలువా కానుక అందించారు. జమ్మూ కశ్మీర్‌కు మరింతగా రవాణా అనుసంధాన పనుల గురించి కూడా గడ్కరీకి అబ్దుల్లా నివేదించినట్లు వెల్లడైంది.

# కరీంనగర్‌కు బీసీ కమిషన్ బృందం రాక..

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝ



**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల :**

తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన అవసరమైన రిజర్వేషన్ల దామాషాను పేర్కొనే విషయంలో ఆసక్తి కలిగిన ఆయా రాజకీయ పార్టీలు, సంఘాలు, ప్రజల అభిప్రాయాలను తెలుసుకునేందుకు వీలుగా తెలంగాణ బీసీ కమిషన్ ప్రతినిధుల బృందం నవంబర్ 1న కరీంనగర్ కు విచ్చేస్తున్నట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజన్న సిరిసిల్ల మరియు కరీంనగర్ ఉమ్మడి జిల్లాకు సంబంధించి నవంబర్ 1న కరీంనగర్ కలెక్టరేట్లో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు కమిషన్ చైర్మన్ నిరంజన్ నేతృత్వంలో సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి, బీ.సీ వెల్ఫేర్ కమిషనర్లతో కూడిన బృందం ప్రజాభిప్రాయ సేకరణ జరుపనుందని వెల్లడించారు.

అభిప్రాయాలు , సలహాలు, సూచనలు, తెలియజేయాలనుకునే వారు రాతపూర్వక సమర్పణలు, అభ్యర్థనలను నేరుగా ఎవరైనను సమర్పించవచ్చని సూచించారు. వారి అభ్యర్థనలతో పాటు నిర్దేశిత నమూనాలో వెరిఫికేషన్ అఫిడవిట్ ఆరు సెట్లను తెలుగు లేదా ఆంగ్ల భాషలో ఇవ్వాల్సి ఉంటుందని, వారి వాదనలకు మద్దతుగా వారి వద్ద ఉన్న సమాచారం, మెటీరియల్, సాక్ష్యాలను, సంబంధిత కేసుల వివరాలను పేర్కొంటూ, సమర్పణలు, అభ్యర్థనలు, సలహాలు, ఆక్షేపణలను కమిషన్ కు నివేదించవచ్చని సూచించారు.



## నూతన తహశీల్దార్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ నాయకులు

**బలగం టీవీ, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల నూతన తహశీల్దారు కాలే నారాయణ రెడ్డిని గురువారం కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి, సాల్వతో సత్కరించి, పూల బొకె అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ఏనుగుల కనుకయ్య, జిల్లా పార్టీ ప్రధానకార్యదర్శి జంగం అంజయ్య, బోయినిపల్లి మాజీ ఎం.పీ.టీ.సి సంబ లచ్చయ్య, కాంగ్రెస్ నాయకుల తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అమరావతి రైల్వే అనుసంధాన ప్రాజక్టుకు కేంద్రం ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

అమరలింగేశ్వర స్వామి, అమరావతి స్థూపం, ధ్యానబుద్ధ, ఉండవల్లి గుహలకు వెళ్లే వారికి ఈ కొత్త రైల్వే లైన్ సులువైన మార్గంగా నిలుస్తుంది. మరోవైపు మచిలీపట్నం, కృష్ణపట్నం, కాకినాడ పోర్టులకు కూడా అనుసంధానిస్తూ నిర్మాణం చేపట్టనుండడంతో బహుళ ప్రయోజనాలు ఉంటాయి. ఈ లైన్ నిర్మాణం ద్వారా 19 లక్షల పనిదినాల ఉపాధి కల్పన జరుగుతుందని అంచనాగా ఉంది. ఈ లైన్ నిర్మాణంతో పాటు ఏకంగా 25 లక్షల చెట్లు నాటి కాలుష్య నివారణకు కూడా కేంద్రం చర్యలు చేపట్టనుంది.కొత్తగా నిర్మించనున్న రైల్వే లైన్ ఎర్రుపాలెం నుంచి అమరావతి మీదుగా నంబూరు వరకు ఉంటుంది. కృష్ణా నదిపై 3.2 కిలోమీటర్ల పొడవైన బ్రిడ్జిని నిర్మించనున్నారు. తెలంగాణలో ఖమం జిల్లా, ఏపీలో ఎన్‌టీఆర్ విజయవాడ, గుంటూరు జిల్లాలను కలుపుతూ ఈ కొత్త రైల్వే లైన్ నిర్మాణం జరగుతుంది.

### బీహార్‌కు రైల్వే ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్

ఏపీ రాజధాని అమరావతి అనుసంధానానికి 57 కిలోమీటర్లు మేర, బిహార్‌లో 256 కిలోమీటర్ల మేర రెండు కీలక ప్రాజెక్టులకు ఆమోదం తెలిపామని అన్నారు. ప్రతిపాదన కొత్త రైల్వే లైన్ అమరావతికి ప్రత్యక్ష కనెక్టివిటీని ఏర్పరుస్తుందని చెప్పారు. ఈ ప్రాంతంలో పరిశ్రమలు నెలకొల్పడానికి, ప్రజల రవాణాకు మెరుగైన వ్యవస్థగా ఉపయోగపడుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. బహుళ-ట్రాకింగ్ ప్రతిపాదన కార్యకలాపాలను సులభతరం చేయడమే కాకుండా రద్దీని తగ్గిస్తుందని అన్నారు.

# అమరుల త్యాగాలు స్ఫూర్తివంతం..

- అన్ని పోలీస్ స్టేషన్స్ పరిధిలో విద్యార్థులకు ఓపెన్ హౌస్
- ఎస్పీ అఖిల్ మహాజన్



**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల :**

పోలీస్ అమరుల త్యాగాలు స్ఫూర్తివంతమని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. గురువారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ (ఫ్లాగ్ డే) కార్యక్రమాల్లో భాగంగా సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఓపెన్ హౌస్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్పీ అఖిల్ మహాజన్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా వారి త్యాగాలను స్మరిస్తూ జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్స్ ఆవరణలో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించి పోలీస్ శాఖ ప్రజలకు అందిస్తున్న సేవలపై,పోలీస్ శాఖ పనితీరు,వివిధ అంశాలపై విధ్యార్థిని,విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు.విద్యార్థులు విద్యతో సమాజంలో జరుగుతున్న పరిణామాలపై అవగహన పెంచుకోవాలని,విద్యార్థులు తప్పనిసరిగా పోలీస్ స్టేషన్ అంటే ఏమిటి,అది ప్రజలకు శాంతి భద్రతల విషయంలో ఏవిధంగా ఉపయోగపడుతుంది,పోలీస్ స్టేషన్ పని తీరు పోలీస్ అధికారులు, సిబ్బంది విధులు ఏవిధంగా ఉంటుందో తెలుసుకోవాల్సిన అవసరం ఉందని, అందు కోసం స్టాల్స్ ను ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగహన కల్పించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సిఐ కృష్ణ, ఆర్ఐ లు యాదగిరి, రమేష్,మధుకర్, ఆర్ఎస్ఐ సాయికిరణ్, సిబ్బంది విద్యార్థులు ఉన్నారు.



# తెలంగాణలో బీసీ కులగణన చారిత్రాత్మకం...



- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు

**బలగం టీవీ , గంభీరావుపేట**

తెలంగాణ రాష్ట్రం లో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ కులగణన చేపట్టడం చారిత్రాత్మకం అనీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు అన్నారు.గురువారం గంభీరావుపేట మండలం రాజుపేట గ్రామ పంచాయతీ ఆవరణలో గంభీరావు పేట ఏ ఎం సీ డైరెక్టర్ అల్లే రాజం ను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం కు ముఖ్య అతిథిగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు హాజరై మాట్లాడుతూ రాష్ట్రం లో సమగ్ర కులగణన తో బీసీ లకు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల లో సామాజిక న్యాయం దక్కాబోతున్నదన్నారు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏ మాత్రం బాగ లేకున్నా రేవంత్ రెడ్డి ప్రభుత్వం మెజారిటీ రైతులకి రుణ మాఫీ చేసిందని,మిగతా రైతులకు కూడా రుణమాఫీ కి ఏర్పాట్లు చేయడం గొప్ప విషయమన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డ్స్ మంజూరి ప్రక్రియ కూడా వారం రోజులలో ప్రారంభం కాబోతున్నాదని , సన్మాన గ్రహీత అల్లే రాజం కష్టానికి ఫలితం గా పదవి దక్కిందన్నారు. రైతులకు, గ్రామస్థులకు అందుబాటులో ఉండి మంచి పేరు తెచ్చుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రం, నారాయణ, లక్ష్మణ్,రాజయ్య, హన్మాండ్లు, బాల్ రాజు, సత్యం, స్వామి, బాలమల్లు, రమేష్, లింగం, కనకయ్య, భరత్, నవీన్ ,మధు, దేవయ్య, భూపతి తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి కార్మికులకు దీపావళి బోనస్

(మొదటి పేజీ తరువాయి)

కార్మికునికి 25వేల రూపాయలు చొప్పున మరో 90 కోట్ల రూపాయలను కంపెనీ చెల్లించింది. ఇప్పుడు దీపావళి బోనస్ కింద ఒక్కొక్కరికి సగటున రూ.93,450లు లభిస్తాయి. మొత్తమ్మీద ఈ నెల రోజుల వ్యవధిలో దీపావళి బోనస్, లాభాల వాటా, పండుగ అడ్వాన్స్ కింద రూ.1250 కోట్ల ను కంపెనీ చెల్లించింది. ఈ విధంగా సగటున సింగరేణి ఉద్యోగులు ఈ నెల రోజుల కాలంలో ఒక్కొక్కరు సుమారు మూడు లక్షల రూపాయల వరకు అందుకున్నారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఆదేశాలపై సింగరేణి సంస్థ సీఎండీ ఎన్. బలరామ్ బోనస్ చెల్లింపుపై తగు ఏర్పాటు చేయాలని ఆయన పర్సనల్ మరియు ఫైనాన్స్ విభాగం అధికారులను ఆదేశించారు.ఈ బోనస్ డబ్బులను దుబారా చేయవద్దని, ప్రభుత్వ పొదుపు సంస్థల్లో దాచుకోవాలని లేదా కుటుంబ అవసరాలకు అనుగుణంగా జాగ్రత్తగా వెచ్చించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# రాజీవ్ చేసిన చట్టానికి తూట్లు పొడుస్తున్నారు

- పార్టీ ఫిరాయింపులు అవసరమా..
- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జీవన్ రెడ్డి ఆవేదన
- ఏఐసీసీ చీఫ్‌కు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి లేఖ..



**బలగం టీవీ, హైదరాబాద్**

. పార్టీ ఫిరాయింపులను నిరోధించేందుకు రాజీవ్ గాంధీ చట్టం తెచ్చారని, ఇప్పుడు ఆ చట్టానికి రాష్ట్రంలో కాంగ్రెస్ వారే తూట్లు పొడుస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత , ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.తెలంగాణలో జరుగుతున్న పార్టీ ఫిరాయింపులను జీర్ణించుకోలేకపోతున్నానని తెలిపారు.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సుస్థిరంగా ఉన్నప్పటికీ పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడాన్ని తప్పుబడుతున్నట్టు చెప్పారు. గురువారం ఏఐసీసీ చీఫ్‌కు కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి లేఖ రాశారు. కాంగ్రెస్‌లో తనకు జరుగుతున్న అన్యాయం, పరిణామాలను వివరించారు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలతో పాటు సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి , పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌లకు ఎమ్మెల్సీ లేఖ రాశారు.

"నేను నమ్ముకున్న కాంగ్రెస్ పార్టీ నన్ను అగౌరవంగా, అవమానంగా చూస్తోంది. నా భవిష్యత్తు కార్యాచరణ పార్టీనే మార్గదర్శకం చేయాలి. కేసీఆర్‌లాగే కాంగ్రెస్.. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడం పట్ల ప్రజలు ఆశ్చర్యానికి గురవుతున్నారు" అంటూ లేఖలో పేర్కొన్నారు.

ఫిరాయింపుల చట్టం లొసుగులతో పార్టీ మారుతున్నారని, అలాగే మరి కొందరు అభివృద్ధి అనే నినాదంతో పార్టీ ఫిరాయించారన్నారు. . కాంగ్రెస్ సుస్థిర ప్రభుత్వానికి కావాల్సిన మెజారిటీ ఉందని, దీంతో ఫిరాయింపుల అవసరం లేదన్నారు. దురదృష్టవశాత్తు తాను అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయినా.. రాష్ట్రంలో ప్రభుత్వం వచ్చిందని సంతోషించానని అన్నారు.. జగిత్యాలలో కాంగ్రెస్ పార్టీ అంటేనే జీవన్ రెడ్డి అనే పరిస్థితి ఉందని అంటూ పార్టీకి నేను అంతే గౌరవం ఇచ్చానన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యే సంజయ్ అనుచరుడిగా భావించే సంతోష్ కాంగ్రెస్ పార్టీ నాయకుడిని హత్య చేశాడని వెల్లడించారు. రాహుల్ గాంధీ ఆలోచనలకు భిన్నంగా పార్టీ నడుస్తోందని తెలిపారు. పార్టీ ఫిరాయించిన వారికి ప్రత్యేక గుర్తింపు ఇవ్వబడుతుందనే అభిప్రాయాన్ని కల్గించే విధంగా పార్టీ వ్యవహారం ఉన్నట్లు పేర్కొన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలతో పోచారం ఇంట్లో సమావేశం నిర్వహించడాన్ని తప్పుబట్టారు. పదేళ్లు బీఆర్ఎస్ దౌర్జన్యాలను ఎదుర్కొన్నానని, . మళ్లీ కాంగ్రెస్ ముసుగులో దౌర్జన్యం చేస్తామంటే మేము ఎలా సహించాలి. నామినేటెడ్ పదవులు, అధికారం చెలాయించాలని కొత్తగా చేరిన ఎమ్మెల్యే లు చూస్తున్నారుఇలాంటి సమయంలో మా పరిస్థితి ఏంటి?" అని ప్రశ్నించారు. పార్టీని కన్నతల్లి అనుకున్నానని.. పార్టీ తనకు అనేక అవకాశాలు ఇచ్చిందని చెప్పుకొచ్చారు. కేసీఆర్‌పై పోటీ చేయమంటే చేశానన్నారు.

"పార్టీ అధిష్ఠానం నా గౌరవాన్ని కాపాడతానని నోటిమాటగా చెప్పింది. పార్టీ ఫిరాయింపులకు ముఠా నాయ కుడు ఉన్నాడు. పార్టీ ఫిరాయింపులకు ముఠా నాయకుడు పోచారం శ్రీనివాస్ రెడ్డి. పది మంది ఎమ్మెల్యేలు లేకపోతే ప్రభుత్వం కొనసాగాదా.. రాహుల్ ఏం చెప్తున్నాడు. మనం ఏం చేస్తున్నాం. మా పార్టీ నాయకుడు గంగారెడ్డిని చంపిన వ్యక్తి బీఆర్ఎస్ తరపున ఎన్నికల్లో డబ్బు లు పంచారు. గంగారెడ్డిని చంపిన సంతోష్‌పై అనేక క్రిమినల్ కేసులు ఉన్నాయి. గంగారెడ్డిని మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నేను ప్రపోజ్ చేశారు. ఎవరి అండదండలు చూసుకొని సంతోష్ మా నాయకుడిని చంపాడు" అంటూ ఆయన ప్రశ్నలు కురిపించారు.

అలాగే జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌పై కూడా జీవన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. "కాంగ్రెస్ పార్టీ పుట్టిందే మా ఇంట్లో అంటున్నాడు. మీ ఇంట్లో కాంగ్రెస్ పార్టీ పుడితే పరాయి ఇంటికి ఎందుకు వెళ్ళాడు. సంజయ్ ఎప్పుడైనా కాంగ్రెస్ పార్టీకి ఓటేశాడా.. నేను రాజీవ్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీలో చేరాను. సంజయ్ చొక్కారావు మనవడిని అని చెప్పుకుంటున్నారు. ఇందిరా గాంధీ కష్టకాలంలో ఉన్నప్పుడు చొక్కారావు జనతా పార్టీలో చేరాడు. సంజయ్ బీఆర్ఎస్‌లో ఎన్నడూ లేడు. అక్కడి ఉద్యమ నాయకుల మధ్య సమన్వయ లోపం వల్ల సంజయ్ తెరపైకి వచ్చాడు. అభివృద్ధి జరగాలంటే అధికార పార్టీలో చేరతామంటే ప్రజాస్వామ్యం ఉంటుందా. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిన కేసీఆర్ పరిస్థితి ఏమయింది" అంటూ వ్యాఖ్యలు చేశారు. అలాగే పోచారం శ్రీనివాస్‌రెడ్డిపైనా ఎమ్మెల్సీ విరుచుకుపడ్డారు. భట్టికి ప్రతిపక్ష నేత హోదా పోవడానికి కారణం పోచారమన్నారు. "పోచారం లాంటి వాడిని పార్టీలో చేర్చుకోవడం ఏంటి? పోచారం సలహాదారుడు ఏంటి. పార్టీ ఫిరాయింపుల క్రమబద్ధీకరణ విషయంలో పోచారం సలహాలు ఇవ్వగలడు" అంటూ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు.

"నేను నిద్రలేని రాత్రులు గడుపుతున్నాను. పార్టీని వదిలి వెళ్ళాలనే ఆలోచన చేయలేకపోతున్న. అవమానాలు భరించుకుంటూ ఉండాలా? రేవంత్ మా నాయకుడు. ఆయన్ని తప్పకుండా కలుస్తాను. కాంగ్రెస్ కార్యకర్తల ఆవేదన మా వ్యక్తిగతం అని పీసీసీ చీఫ్ భావిస్తే నేనేం చేయగలను. పార్టీ పట్ల గౌరవం లేకనే నేను ఇక్కడి దాకా వచ్చానా.. నేను రాజకీయం చేయడం లేదు. సంజయ్ భుజాలు తడుముకుంటున్నాడు. మా పార్టీ నాయకుడిని చంపిన నిందితుడు సంజయ్ అనుచరుడు కాదని చెప్పగలరా.. సంజయ్ ఏ పార్టీలో ఉన్నాడో ఆయనకి క్లారిటీ లేదా.. దానం నాగేందర్‌కు ఎంపీ టికెట్ ఇవ్వడాన్ని సమర్థించడం లేదు. నేను ఎప్పుడూ పార్టీ ఫిరాయించలేదు. పదేండ్లలో నేను పార్టీని నిలబెట్టాను. రాహుల్ ప్రధాని కావాల్సిందే. నామినేటెడ్ పదవులు మాకు ఇవ్వాలి. పార్టీలో మాదే ఆధిపత్యం ఉండాలి అంటే ఎలా. పార్టీ ఫిరాయించి ముసుగేసుకొని దౌర్జన్యం చేయడం బ్లాక్ మెయిల్ కాదా. నా మానసిక పరిస్థితి అర్థం చేసుకోండి. పార్టీ ఫిరాయింపులు జరిగాయో లేదో క్లారిటీ లేకుండా పోతుంది. నేను పార్టీకి అంతర్గతంగా లేఖ రాశాను. ఆవేదన భరించలేక బయటకి చెప్పుకుంటున్నా" అని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి లేఖలో పేర్కొన్నారు.

# కానిస్టేబుళ్ల భార్యల ఆందోళన



- సంఘీభావం ప్రకటించిన కేటీఆర్

**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్రంలో ఆయా బెటాలియన్లలో పని చేస్తున్న పోలీసు కానిస్టేబుళ్ల కుటుంబాల ఆందోళనలు కొనసాగుతున్నాయి. గురువారం సిరిసిల్ల, డిచ్‌పల్లి బెటాలియన్ల వద్ద కానిస్టేబుళ్ల భార్యలు, కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. తమ భర్తలను కూలీలుగా మార్చి వెట్టి చాకిరి చేయిస్తున్నారని 17వ బెటాలియన్ పోలీసుల కానిస్టేబుళ్ల భార్యలు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసు ఉద్యోగానికి తమ భర్తలు చేస్తున్న పనికి సంబంధం లేకుండా కూలీ పని చేయిస్తున్నారని మండిపడ్డారు. వన్ పోలీసింగ్ విధానాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు.

నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలోని ఏడో బెటాలియన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ భార్యలు రోడ్డెక్కి నిరసన చేపట్టారు. జాతీయ రహదారి 44పై వారు నిరసన తెలిపారు. తమ భర్తల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వారంతా డిమాండ్ చేశారు. అదే సమయంలో ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు వెళ్తున్న కేటీఆర్ మార్గమధ్యలో ఆందోళన చేస్తున్న ఏడో బెటాలియన్ కానిస్టేబుల్ భార్యలకు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా కేటీఆర్ బెటాలియన్ పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడారు. సాధ్యమైనంత తొందరగా కానిస్టేబుళ్ల సమస్యలను తీర్చాలని సూచించారు. లేదంటే బీఆర్ఎస్ పార్టీ తరఫున వారికి అండగా ఉండి.. అవసరమైతే నిరసన కార్యక్రమాలకు పిలుపునిస్తామని చెప్పారు.

# సోషల్ మీడియాపై భారీగా ఖర్చు చేస్తున్న కేటీఆర్



**బలగం టీవీ, హైదరాబాద్**

ప్రభుత్వంపై బురదజల్లేందుకు సామాజిక మాధ్యమాలపై కేటీఆర్ భారీగా ఖర్చు చేస్తున్నారని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. హైడ్రా, మూసీ సుందరీకరణపై బీఆర్ఎస్ నాయకులు బురద జల్లుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలు వాస్తవా లకు దగ్గరగా మాట్లాడాలని ఆయన సూచించారు. ప్రజలు కూడా వాస్తవాలను గ్రహించాలన్నారు. పది నెలల్లోనే అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. దీన్ని ఓవర్వలేక కెటిఆర్.. కాంగ్రెస్ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేయిస్తున్నాడని పేర్కొన్నారు.

# ఆ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయండి..



- ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్**

కాంగ్రెస్ ప్రభుత్వానికి దమ్ముంటే పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసి ఎన్నికలకు వెళ్లాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ప్రభుత్వానికి సవాల్ విసిరారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై వేటు వేయాలని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ జీవన్ రెడ చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్యే వేముల స్పందించారు. మీ పార్టీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని డిమాండ్ చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, శాసన సభాపతి ప్రసాద్, ఎమ్మెల్సీ గుత్తా సుఖేందర్ రెడ్డి త్వరగా నిర్ణయం తీసుకోవాలన్నారు. ప్రజాక్షేత్రంలోకి వెళ్దాం. ప్రజలే న్యాయ నిర్ణేతలు. మీ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేఖ విధానాలను ప్రజలు గమనిస్తున్నారు. ప్రజలు మీకు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

# తల్లితో సహజీవనం కూతురితో ప్రేమ..!



**బలగం టీవీ, హైదరాబాద్**

తల్లితో సహజీవనం చేస్తూనే ఆమె కుమార్తెతో ప్రేమాయణం నడిపాడు ఓ ప్రబుద్ధుడు. అంతే కాదు తల్లికి చెప్పకుండా స్కూల్ నుంచి ఆ బాలికను తనతో తీసుకెళ్లాడు. సాయంత్రమైనా ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆ మహిళ ఆందోళన చెందింది. రాత్రి వరకు చుట్టుపక్కల వెతికి చివరకు పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు బాలిక ఆచూకీ కోసం గాలింపు చేపట్టగా ఆ ఇద్దరూ హైదరాబాద్‌లో దొరికారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఒంగోలు సమీపంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ కొంత కాలంగా తన భర్తకు దూరంగా ఉంటోంది. ఆమెకు పదో తరగతి చదువుతున్న తన కుమార్తెతో కలిసి వేరుగా జీవిస్తోంది. అయితే టంగుటూరు మండలం పొందూరుకు చెందిన ఇండ్లా రాజు అనే వ్యక్తితో ఈ తల్లీకూతుళ్లకు పరిచయం ఏర్పడింది. అలా ఆ మహిళతో రాజు సహజీవనం చేయడం ప్రారంభిం చాడు. ఈ క్రమంలోనే అతడు ఆమె కుమార్తెపైనా కన్నేశాడు. రోజు ఆమెను స్కూలుకు తీసుకెళ్లి తీసుకు వస్తుండేవాడు. అలా తల్లితో సహ జీవనం చేస్తూ తండ్రి స్థానంలో ఉన్న రాజు తన నైతికతను మరిచాడు. ఆ బాలికకు మాయమాటలు చెబుతూ ప్రేమలో దింపాడు.

అతడిని నమ్మిన ఆ బాలిక ఏం చెప్పినా వినడం మొదలుపెట్టింది. ఇక ఆమెను పూర్తిగా లోబర్చుకున్న రాజు ఆమె తల్లి వద్ద నుంచి బాలికను తీసుకెళ్లాలని ప్లాన్ వేశాడు. అలా రెండ్రోజుల క్రితం రోజూలాగే బాలికను స్కూల్‌లో దింపొస్తానని ఆమె తల్లికి చెప్పి తీసుకెళ్లాడు. అయితే సాయంత్రమైనా తిరిగి రాలేదు. రాత్రి వరకు వేచి చూసి అయినా ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల, బంధువులు, స్నేహితుల ఇళ్లలో ఆరా తీసింది ఆ తల్లి. అయినా ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులను ఆశ్రయించింది. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ఒంగోలు రెండో పట్టణ పోలీసులు విచారణ చేపట్టారు. ఈ క్రమంలో బాలికతో పాటు నిందితుడు హైదరాబాద్‌లో ఉన్నట్లు గుర్తించి నగరానికి వచ్చారు. వారిద్దరిని ఒంగోలు తీసుకెళ్లారు. ఆ తర్వాత బాలికకు కౌన్సెలింగ్ ఇచ్చి ఆమె తల్లితో ఇంటికి పంపించారు. ఇక రాజుపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు సీఐ ఎం.శ్రీనివాసరావు తెలిపారు.

# సుందర్ తిప్పేశాడు...

## 7 వికెట్లతో సత్తా చాటిన ఆల్‌రౌండర్ కివీస్ 259 ఆలౌట్ భారత్ 16/1



**బలగం టీవీ, పుణె**

మూడున్నరేళ్ల తర్వాత రీఎంట్రీ ఇచ్చిన ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ బౌలింగ్‌లో అదరగొట్టాడు. ఏకంగా 7 వికెట్లతో విజృంభించడంతో రెండో టెస్టులో తొలి ఇన్నింగ్స్‌లో కివీస్ 259 పరుగులకు కుప్పకూలింది. మరోవైపు సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ 3 వికెట్లు దక్కించుకున్నాడు

పుణె వేదికగా భారత్‌తో జరుగుతున్న రెండో టెస్టులో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న న్యూజిలాండ్ జట్టు.. డెవాన్ కాన్వే(141 బంతుల్లో 11 ఫోర్లతో 76), రచిన్ రవీంద్ర(105 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 65) హాఫ్ సెంచరీలతో రాణించగా.. మిచెల్ సాంట్నర్(51 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 33) పర్వాలేదనిపించాడు. భారత బౌలర్లలో వాషింగ్టన్ సుందర్(7/59), రవిచంద్రన్ అశ్విన్(3/64) కివీస్ పతనాన్ని శాసించారు. 147 ఏళ్ల టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఒకే ఇన్నింగ్స్ ఆఫ్ స్పిన్నర్లే 10 వికెట్లు తీయడం ఇదే తొలిసారి.

కివీస్ భారీ స్కోర్ సాధించే దిశగా వెళ్తున్న సమయంలో సుందర్ మ్యాజిక్ చేశాడు. 65 వ్యక్తిగత పరుగుల వద్ద రచిన్‌ను క్లీన్‌బౌల్డ్ చేశాడు. అలాగే కొద్ది సేపటికే వికెట్ కీపర్ టామ్ బ్లండెల్ (3 పరుగులు)ను కూడా సుందర్ పెవిలియన్ చేర్చాడు. దీంతో కివీస్ 201-5కు చేరింది. ఇక ఆ తర్వాత కూడా అదిరే ప్రదర్శనతో టపటపా వికెట్లు కూల్చాడు. సుందర్ దెబ్బకు కివీస్ 62 పరుగుల వ్యవధిలో చివరి 7 వికెట్లు కోల్పోయింది. అంతకుముందు ఓపెనర్లు టామ్ లాథమ్(15), డెవాన్ కాన్వే నిదానంగా నడిపించారు. భారత బౌలర్ల సహనానికి పరీక్షగా నిలిచిన ఈ జోడీని అశ్విన్ విడదీసాడు. తన తొలి ఓవర్‌లోనే టామ్ లాథమ్(15) వికెట్ల ముందు బోల్తా కొట్టించాడు. క్రీజులోకి వచ్చిన విల్ యంగ్‌ను కూడా అశ్విన్ కీపర్ క్యాచ్‌గా బోల్తా కొట్టించాడు. క్రీజులోకి రచిన్ రవీంద్ర రాగా.. న్యూజిలాండ్ 92/2 లంచ్‌బ్రేక్‌కు వెళ్లింది. సెకండ్ సెషన్‌లో డెవాన్ కాన్వే 109 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ప్రమాదకరంగా మారిన ఈ జోడీని అశ్విన్ విడదీసాడు. కాన్వేను కీపర్ క్యాచ్‌గా పెవిలియన్ చేర్చాడు.

### భారత్ కు షాక్

తొలి రోజు ఆఖరి సెషన్‌లో ఫస్ట్ ఇన్నింగ్స్ ప్రారంభించిన టీమ్‌ఇండియాకు ఆదిలోనే షాక్ తగిలింది. కెప్టెన్ రోహిత్ శర్మ (0) డకౌట్‌గా పెవిలియన్ చేరాడు. పేసర్ టిమ్ సౌథీ ఇన్‌స్వింగర్‌కు రోహిత్ క్లీన్ బౌల్డయ్యాడు. దీంతో భారత్ 1 పరుగుకే తొలి వికెట్ కోల్పోయింది. యశస్వి జైస్వాల్(6 బ్యాటింగ్), శుభ్‌మన్ గిల్(10 బ్యాటింగ్) మరో వికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడారు. ప్రస్తుతం టీమ్‌ఇండియా 16-1 స్కోర్‌తో ఉంది.

# వరల్డ్‌కప్ విజేతకు షాక్

## తొలి వన్డేలో కివీస్ మహిళా జట్టుపై భారత్ ఘన విజయం



**బలగం టీవీ, అహ్మదాబాద్**

టీ20 వరల్డ్ కప్ విజేత న్యూజిలాండ్‌కు భారత మహిళల జట్టు షాకిచ్చింది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో గురువారం జరిగిన తొలి వన్డేలో రాధా యాదవ్ (3/35), సైమా థాకూర్(2/26)లు చెలరేగగా భారత్ 56 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ విజయంతో ఐదు వన్డేల సిరీస్‌లో టీమిండియా 1-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.

ముందు బ్యాటింగ్ చేసిన టీమ్‌ఇండియా 44.3 ఓవర్లలో 227 పరుగులకు ఆలౌటైంది. తేజల్ హసబ్నిస్ (42 పరుగులు), దీప్తి శర్మ (41 పరుగులు) రాణించారు. షఫాలి వర్మ (33 పరుగులు), యస్తికా భాటియా (37 పరుగులు), జెమిమా రోడ్రిగ్స్ (35 పరుగులు) ఫర్వాలేదనిపించారు. కివీస్ బౌలర్లలో అమేలియా కెర్ 4, జెస్ కెర్ 3, కార్సన్ 2, సుజీ బేట్స్ ఒక వికెట్ పడగొట్టారు.

అనంతరం 228 పరుగుల ఛేదనకు దిగిన కివీస్ బ్యాటర్లు భారత బౌలర్ల ప్రదర్శనతో ఆలౌటయ్యారు. ఓపెనర్ సుజీ బేట్స్(1)ను సైమా థాకూర్ డగౌట్‌కు చేర్చి కివీస్‌ను ఒత్తిడిలో పడేసింది.ఆ తర్వాత జార్జియా ప్లిమ్మర్(25), లారెన్ డౌన్(26)లు జట్టును ఆదుకున్నారు. అయితే.. దీప్తి శర్మ డేంజరస్ ప్లిమ్మెర్‌ను వెనక్కి పంపగా.. డౌన్‌ను రాధా యాదవ్ ఔట్ చేసింది. కెప్టెన్ సోఫీ డెవినె(2) మళ్లీ నిరాశపరుస్తూ రనౌట్ అయింది. 79 పరుగులకే 4 కీలక వికెట్లు కోల్పోయిన కివీస్‌ను బ్రూక్ హల్లిడే(39), మ్యాడీ గ్రీన్(31)లు గట్టెక్కించే ప్రయత్నం చేశారు. కానీ, సైమా బౌలింగ్‌లో మంధాన విసిరిన త్రోకు గ్రీన్ రనౌట్ కాగా.. నాలుగో బంతికి హల్లిడే క్యాచ్ ఇచ్చి డగౌట్ చేరింది. అంతే.. కివీస్ ఓటమి ఖాయమైంది. ఆఖర్లో అమేలియా కేర్(25 నాటౌట్) కాసేపు ప్రతిఘటించినా రాధా యాదవ్ వికెట్ తీసి భారత్‌కు విజయాన్ని అందించింది. బ్యాటుతో, బంతితో రాణించిన దీప్తి శర్మ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపికైంది. ఇరుజట్ల మధ్య రెండో వన్డే అక్టోబర్ 27న ఇదే స్టేడియంలో జరుగనుంది.


# 'పుష్ప 2' విడుదల తేదీలో మార్పు.. ఒక్కరోజు ముందుగానే..

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ - సుకుమార్ కాంబోలో భారీ అంచనాలతో తెరకెక్కుతున్న సినిమా 'పుష్ప 2'. ఈ సినిమా గురించి విశేషాలు షేర్ చేసుకోవడానికి మేకర్స్ గురువారం ప్రెస్‌మీట్ నిర్వహించారు. అయితే ఈ ప్రెస్‌మీట్‌లో మేకర్స్ సినిమాను (డిసెంబర్ 6) ముందుగా ప్రకటించిన దానికంటే, ఒక రోజు ముందుగానే రిలీజ్ చేయనున్నట్లు చెప్పారు. అంటే డిసెంబర్ 05 నుంచే థియేటర్లలో 'పుష్ప' సందడి మొదలు కానుంది.ఈ సినిమాపై చాలా కాన్ఫిడెంట్?గా ఉన్నట్లు మేకర్స్ పేర్కొన్నారు. రిలీజ్ రోజే ఇండస్ట్రీలోని అన్ని రికార్డులను పుష్ప బ్రేక్ చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అటు కర్ణాటకలోనూ ఇప్పటివరకు అత్యధిక వసూళ్లలో టాప్‌లో ఉన్న 'బాహుబలి 2'ను కూడా ఇది దాటేస్తుందని అన్నారు.

సినిమాలో గంగమ్మ జాతర సన్నివేశం చిత్రీకరణకు దాదాపు 35రోజులు పట్టిందని నిర్మాతలు అన్నారు. ఈ సీన్ కోసం హీరో అల్లు అర్జున్ ఎంతో కష్టపడ్డారని చెప్పారు. 'ఆ ఎపిసోడ్ చిత్రీకరణకు దాదాపు 35 రోజులు పట్టింది. దాని కోసం రిహార్సల్స్ కూడా చేశారు. ఈ ఎపిసోడ్ విషయంలోనే కాదు ప్రతి సన్నివేశం కోసం దర్శకుడు సుకుమార్, అల్లు అర్జున్ చాలా కష్టపడ్డారు. అందరూ ఊహిస్తున్నట్టే ఆ ఎపిసోడ్ రోమాలు నిక్కబొడుచుకునేలా చేస్తుంది' అని అన్నారు.

మైత్రీ మూవీ మేకర్స్ అధినేత రవిశంకర్ మాట్లాడుతూ.. పుష్ప 2 అదిరిపోతుందని తెలిపాడు. ముందుగా ఈ చిత్రంలో నటించిన వారందరికి ధన్యవాదాలు. అల్లు అర్జున్ గత 2 ఏండ్ల నుంచి పగలు రాత్రి అని తేడా లేకుండా ఎంతో కష్టపడి ఈ సినిమాను చేశాడు. అల్లు అర్జున్ కెరీర్‌లోనే ఇది బెస్ట్ మూవీ అవుతుంది. ఇది కచ్చితంగా బ్లాక్ బస్టర్ అవుతుందనే నమ్మకం ఉంది. ప్రేక్షకులు కోరుకుంటున్నట్లు ఒకరోజు ముందుగానే ఈ సినిమాను తీసుకువస్తున్నాం అంటూ రవిశంకర్ చెప్పుకోచ్చాడు.




# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న దిల్ రాజు దంపతులు

**బలగం టీవీ, తిరుమల**

తెలుగు సినీ నిర్మాత దిల్ రాజు గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. భార్య, కుమారుడితో కలిసి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయాధికారులు సాదర స్వాగతం పలికారు. అర్చకులు స్వామి వారి తీర్థ, ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయం బయట దిల్‌రాజు అభిమానులు ఆయనతో ఫొటోలు దిగడానికి పోటి పడ్డారు. ప్రస్తుతం దిల్ రాజు మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ గేమ్ ఛేంజర్ సినిమాను తీస్తున్నారు. ఈ సినిమా జనవరిలో విడుదల కానుంది.





# ఆటకు రాణీ రాంపాల్ వీడ్కోలు

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

భారత మహిళా హాకీ జట్టు మాజీ కెప్టెన్ రాణీ రాంపాల్ ఆటకు వీడ్కోలు పలికింది. సుదీర్ఘ కెరీర్‌కు ముగింపు పలుకుతున్నట్టు గురువారం రాంపాల్ వెల్లడించింది. టీమిండియా విజయాల్లో కీలక పాత్ర పోషించిన ఆమె తన 16 ఏండ్ల కెరీర్‌కు గుడ్ బై చెప్పింది. ఫార్వర్డ్ ప్లేయర్ అయిన రాణి సారథిగా భారత హాకీకి వన్నె తెచ్చింది. ఆమె ఏకంగా 254 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడింది. 'భారత జట్టుతో నా ప్రయాణం ఎంతో చిరస్మరణీయం. ఇన్ని ఏండ్లు దేశం తరపున ఆడుతానని నేను అస్సలు ఊహించలేదు. బాల్యంలో చాలా పేదరికం అనుభవించాను. అయినా సరే టీమిండియాకు ఆడాలనే కసితో అన్ని అడ్డండకులు దాటి నా కలను నిజం చేసుకున్నా' అని రాణి చెప్పింది.

# 'టార్జన్' నటుడు కన్నుమూత

**బలగం టీవీ, న్యూఢిల్లీ**



హాలీవుడ్ చిత్ర పరిశ్రమలో విషాదం చోటు చేసుకుంది. ప్రముఖ హాలీవుడ్ సిరీస్ టార్జాన్ నటుడు రాన్ ఎలీ కన్నుమూశారు. ప్రస్తుతం ఇతడి వయసు 86. అనారోగ్యంతో బాధపడుతున్న రాన్ ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచినట్లు ఆయన కుటుంబ సభ్యులు వెల్లడించారు. కాగా, రాన్ ఎలీ మరణం హాలీవుడ్ సినీ పరిశ్రమకు తీరని లోటు అని, ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఇండస్ట్రీలోని పలువురు సినీ ప్రముఖులు సోషల్ మీడియా ద్వారా సంతాపం వ్యక్తం చేస్తున్నారు

# తెలంగాణాకు కొరియా షూ కంపెనీ !



బలగం టీవీ, హైదరాబాద్

తెలంగాణలో పెట్టుబడులకు మరో అంతర్జాతీయ సంస్థ ముందుకొచ్చింది. మెడికల్, స్మార్ట్ బూట్ల ఉత్పత్తిలో అగ్రగామి కొరియన్ కంపెనీ షూ ఆల్స్ రాష్ట్రంలో కంపెనీ ఏర్పాటుకు ఆసక్తి కనబరిచింది. రూ.300 కోట్ల పెట్టుబడులతో సంస్థ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను మంత్రి శ్రీధర్‌బాబుకు అందజేసింది.కంపెనీ ఏర్పాటుకు 750 ఎకరాల భూమి కేటాయించాలని కోరింది. కొరియా నుంచి వచ్చిన షుఆల్స్ ఛైర్మన్ చెవోంగ్‌లీతో పాటు సంస్థ ప్రతినిధులు గురువారం సచివాలయంలో శ్రీధర్‌బాబును కలిశారు. 87 వేల మందికి ఉద్యోగాలు కల్పించే "గిగా ఫ్యాక్టరీ" ప్రతిపాదనను ఆయన ముందుంచారు. అడుగు భాగాన (సోల్స్) మెడికల్ చిప్ ఉండే బూట్లు, పదివేల అడుగులు వేస్తే గంటకు 25 వాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేసే షుతో పాటు డయాబెటీస్, ఆర్థరైటిస్ ఉన్న వారికి ఉపశమనం, స్వస్థత కలిగించే పలురకాల ఉత్పత్తులతయారీ గురించి ప్రతిపాదనలు అందజేశారని మంత్రి వెల్లడించారు. బూట్ల తయారీలో జంతువుల చర్మాన్ని వినియోగించడం వల్ల ట్యానరీలు అవసరమవుతాయని, ఇలా యాన్సిల్లరీ పరిశ్రమలతో అనేక మందికి ఉపాధి దొరుకుందని మంత్రి వెల్లడించారు. ప్రపంచ మార్కెట్లకు తెలంగాణా హబ్‌గా మారుతోందన్నారు.

## సెంట్రల్ స్కిల్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యుడిగా మల్లురవి



బలగం టీవీ, హైదరాబాద్

కేంద్ర స్కిల్ డెవలప్‌మెంట్ మంత్రిత్వ శాఖ సంప్రదింపుల కమిటీ సభ్యుడిగా నాగర్‌కర్నూలు ఎంపి మల్లురవి నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర మంత్రిత్వశాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీకి కేంద్ర స్కిల్ డెవలప్‌మెంట్ శాఖ మంత్రి జయంత్ చౌదరి ఛైర్మన్‌గా ఉంటారు. లోక్‌సభ నుంచి 7 మంది, రాజ్యసభ నుంచి 7 మంది, ఎక్స్ అఫిషియో సభ్యులు ఇద్దరు మొత్తం 16 మందితో ఈ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో తెలంగాణ రాష్ట్రం నుంచి మల్లు రవితో పాటు , వరంగల్ ఎంపి కడియం కావ్య నియమితులు కావడం విశేషం .

# 'కేసీఆర్ చెప్పినట్టే 'కాళేశ్వరం' నిర్మాణం'

- కాళేశ్వరం కమిషన్ ముందుకు మాజీ ఈఎన్‌సీ వెంకటేశ్వర్లు
- అంతా కేసీఆర్ ఆదేశాలతోనే జరిగిందన్న వెంకటేశ్వర్లు
- 2016లో సమీక్షకు పిలిచే వరకు తమకేం తెలియదని స్పష్టం
- మూడు బ్యారేజీలను వ్యాప్కోస్ ఫైనల్ చేసిందన్న మాజీ ఈఎన్‌సీ

బలగం టీవీ, హైదరాబాద్

అప్పటి ముఖ్యమంత్రి ఆలోచన మేరకు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం జరిగిందని, ప్రభుత్వాధినేత ఆదేశాల మేరకే మేడిగడ్డ ఆనకట్టలో నీరు నిల్వ చేసినట్లు విశ్రాంత ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు తెలిపారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టలకు సంబంధించిన అంశాలపై విచారణ చేస్తున్న కమిషన్, గురువారం మరోమారు ఆయనను ప్రశ్నించింది. గత విచారణకు కొనసాగింపునకు నల్లా వెంకటేశ్వర్లును జస్టిస్ పీసీ ఘోష్ క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు. రెండు విడతలుగా చేసిన విచారణలో 128 ప్రశ్నలు అడిగారు. కాళేశ్వరం ప్రాజెక్టు డీపీఆర్ తయారీ నిర్ణయం ఎప్పుడు, ఎవరు తీసుకున్నారని కమిషన్ ప్రశ్నించింది. 2016 జనవరిలో అప్పటి ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అధికారుల సమీక్షలో నిర్ణయం జరిగిందన్న వెంకటేశ్వర్లు, కాళేశ్వరం ప్రాజెక్టు ఆలోచన అప్పటి ముఖ్యమంత్రిదేనని, సమీక్షకు పిలిచే వరకు తమకు ఎలాంటి సమాచారం లేదని అన్నారు. డీపీఆర్ కేంద్ర జలసంఘం ఆమోదం పొందిన తర్వాత మార్పులు జరిగాయా అని జస్టిస్ ప్రశ్నించారు. నిర్మాణ ప్రాంత పరిస్థితి ఆధారంగా కేంద్ర జలసంఘం ఆమోదం పొందిన తర్వాత డీపీఆర్?లో మార్పులు జరిగాయన్న వెంకటేశ్వర్లు, ఉన్నతస్థాయి కమిటీ ఆదేశాల మేరకు మార్పులు జరిగాయని చెప్పారు. మూడు ఆనకట్టల నిర్మాణ స్థలాన్ని వ్యాప్కోస్ సంస్థ సూచించిందని తెలిపారు.

ప్రభుత్వ, అధికారుల ప్రమేయం లేకుండా వ్యాప్కోస్ ఎలా సూచిస్తుందని కమిషన్ ప్రశ్నించింది. పలు ప్రశ్నలకు సమాధానంగా అప్పటి ప్రభుత్వాధినేత నిర్ణయాల మేరకే ముందుకెళ్లినట్లు వెంకటేశ్వర్లు కమిషన్‌కు తెలిపారు. ప్రాణహిత – చేవేళ్ల పనుల కోసం ఖర్చు చేసిన రూ. 16 వేల కోట్లు వృథా చేయడం ఏ మేరకు సబబని ప్రశ్నించిన కమిషన్, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం కాదా అడిగింది. అప్పటి ప్రభుత్వం విధానపర నిర్ణయం తీసుకొందని వెంకటేశ్వర్లు తెలిపారు. కేవలం 2 లక్షల ఎకరాల అదనపు ఆయకట్టు కోసం ఇంత పెద్ద మొత్తంలో ఖర్చు చేస్తారా? అని కమిషన్ ప్రశ్నించింది.

తమ్మిడిహట్టి నుంచి తక్కువ విద్యుత్, రెండు లిఫ్టలతోనే నీరు వచ్చేది కదా అన్న కమిషన్, మూడు లిఫ్టులు, భారీ మొత్తంలో విద్యుత్ ఉపయోగించాల్సిన అవసరం ఏముందని అడిగింది. తమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత లేదని, అన్ని అంశాలను పరిగణలోకి తీసుకొని ప్రభుత్వం నిర్ణయం తీసుకొందని వెంకటేశ్వర్లు వివరించారు. రెండు లక్షల అదనపు ఆయకట్టుతో పాటు 18 లక్షల ఎకరాలకు పైగా స్థిరీకరణ కూడా ఉందని తెలిపారు. విశ్రాంత ఇంజినీర్ల సూచనలను ఎందుకు పరిగణలోకి తీసుకోలేదని, ఉద్దేశపూర్వకంగా పక్కన పెట్టారా అని జస్టిస్ పీసీఘోష్ ప్రశ్నించారు. ఆ అంశం తనకు తెలియదని వెంకటేశ్వర్లు చెప్పారు.

# పేదల ఇండ్ల కూల్చివేయడాన్ని వ్యతిరేకిస్తున్నాం

- నేడు ఇందిరాపార్క్ వద్ద ధర్నా
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



బలగం టీవీ, హైదరాబాద్

"మూసీ పునరుజ్జీవం" పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇండ్ల కూల్చివేయడాన్ని భారతీయ జనతా పార్టీ పక్షాన తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం." అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

" ఈ పథకం పేరుతో కాంగ్రెస్ పార్టీ భారీ ఎత్తున అవినీతికి తెరదీస్తోంది. రూ.1 లక్షా 50 వేల కోట్ల వ్యయంతో చేపడుతున్న ఈ ప్రాజెక్టును కాంగ్రెస్ పార్టీ ఏటీఎంలాగా ఉపయోగించుకోవాలనుకుంటోంది. ఉద్యోగులకు జీతాలివ్వడమే గగనమైంది. గత పాలకులు చేసిన దాదాపు రూ.6 లక్షల కోట్ల పైచిలుకు అప్పులకు 10 నెలల్లోనే రూ.60 వేల కోట్లు వడ్డీల రూపంలో చెల్లిస్తూ ప్రజాధనాన్ని వృథా చేస్తోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించడానికే నానా తంటాలు పడుతూ సంక్షేమ పథకాలను అమలు చేయలేని పరిస్థితి నెలకొంది. ఈ డబ్బుల్లేక రాష్ట్ర ప్రభుత్వం తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది.

ఈ పరిస్థితుల్లో మరో లక్షన్నర కోట్ల రూపాయల మేరకు అప్పు చేసి మూసీ పునరుజ్జీవం పేరుతో పేదల ఇండ్లను కూల్చాలనుకోవడం దుర్మార్గం. ఇప్పటికే మూసి ప్రక్షాళన పేరుతో గత మూడు దశాబ్దాలుగా జైకా, జపాన్ సహా ఇతరత్రా మార్గాల ద్వారా పెద్ద ఎత్తున నిధులు కూడా ఖర్చు చేశారు. మూసీ సుందరీకరణ పేరుతో పాలకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం నిధులు ఖర్చు చేస్తున్నారే తప్ప మూసీ పరిస్థితి ఏ మాత్రం మారలేదు.

గత పాలకులు లక్ష కోట్ల రూపాయలకుపైగా అప్పు చేసి కాళేశ్వరం ప్రాజెక్టును ఏటీఎంలా వాడుకుంటే, ఇప్పుడు కాంగ్రెస్ పాలకులు 'మూసీ పునరుజ్జీవం' పేరుతో మరో లక్షన్నర కోట్లు అప్పు చేసి ఏటీఎం మాదిరిగా వాడుకోవాలని చూస్తుండటం బాధాకరం. ఈ అప్పుల భారమంతా వివిధ రకాల పన్నుల రూపంలో ప్రజలపై భారం పడుతుంది.

ఇప్పటికే రాష్ట్ర ప్రజలు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారు. నాబార్డ్ సంస్థ ఇచ్చిన "ఆల్ ఇండియా రూరల్ ఫైనాన్షియల్ ఇంక్లూజన్ సర్వే" నివేదిక ప్రకారం దేశంలోనే అత్యధికంగా అప్పుల్లో ఉన్నది తెలంగాణ వాసులే. రాష్ట్రంలో ఒక్కో కుటుంబంపై సగటున రూ.1,29,599 అప్పు ఉంది. జాతీయ సగటు కంటే రూ.40 వేలు ఎక్కువ. రాష్ట్రంలో దాదాపు 92 శాతం కుటుంబాలు అప్పుల్లోనే ఉన్నాయి. జాతీయ సగటు 52 శాతం కుటుంబాలు మాత్రమే.

వాస్తవానికి భారతీయ జనతా పార్టీ 'మూసీ ప్రక్షాళన'కు వ్యతిరేకం కానేకాదు. కానీ తెలంగాణ రాష్ట్రం, ప్రజల ఆర్థిక పరిస్థితి అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న ఈ తరుణంలో మళ్లీ లక్షన్నర కోట్ల రూపాయల కుపైగా అప్పులు చేసి మూసీ పునరుజ్జీవం పేరుతో ప్రజలపై మోయలేని భారం మోయడాన్ని మాత్రమే వ్యతిరేకిస్తోంది. పేదల ఇండ్లను కూల్చివేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ తీరును నిరసిస్తూ మూసీ బాధితుల పక్షాన రేపు (ఈనెల 25న) ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్ రెడ్డి గారి ఆధ్వర్యంలో చేపట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని కోరుతున్నా. మూసీ బాధితులు, ప్రజలు పెద్దఎత్తున మహాధర్నా కార్యక్రమంలో పాల్గొనాలని విజప్తి చేస్తున్నాం.

## ఆర్టీసీ బస్సులో మహిళ మృతి..

బలగం టీవీ, హైదరాబాద్

ఆర్టీసీ బస్సులో మహిళ మృతి చెందిన ఘటన గురువారం హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని వంగపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన అంకిళ్ల కవిత (36) తన భర్త కుమారస్వామి తో కలిసి గత నాలుగు రోజుల క్రితం వరంగల్ లోని ఎంజీఎం ఆసుపత్రికి వైద్యం కోసం వెళ్ళింది. గురువారం ఉదయం ఎంజీఎం ఆసుపత్రి నుండి తన స్వగ్రామానికి వెళ్ళిపోతామంటూ డాక్టర్లను కోరింది. దాంతో అక్కడి వైద్యులు డిశ్చార్జ్ రాశారు. ఇంటికి తిరుగు ప్రయాణంలో భాగంగా ఆర్టీసీ బస్సులో ఎక్కారు. వంగపల్లి ఆర్టీసీ బస్టాప్ వద్దకు బస్సు చేరుకోగానే భర్త కుమారస్వామి సీట్లో పడుకున్న భార్య కవితను నిద్ర లేపే ప్రయత్నం చేయగా ఆమె ఎంతకీ నిద్ర నుండి లేవకపోవడంతో బస్సులోనే మృతి చెందినట్లు ప్రయాణికుల తో పాటు ఆర్టీసీ సిబ్బంది నిర్ధారణ చేశారు. వంగపల్లి బస్టాప్ వద్ద ఉన్న గ్రామస్తుల సహకారంతో ఆమె మృతదేహాన్ని ఆర్టీసీ బస్సులో నుంచి దించారు. మృతురాలికి ఒక కూతురు, ఇద్దరు కుమారులున్నారు.

# కాంగ్రెస్‌కు ఏటీఎంగా తెలంగాణ : కేటీఆర్



బలగం టీవీ, హైదరాబాద్

: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సరిహద్దు రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటక సరిహద్దులను మూసేయాలని, భద్రతను కట్టుదిట్టం చేయాలని శివసేన నాయకుడు కిరణ్ పావస్కర్ డిమాండ్ చేశారు. ఈ అంశంపై కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు. ఎందుకంటే కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటక నుంచి మహారాష్ట్రకు వందల కోట్ల నగదును తరలించే అవకాశం ఉందని కిరణ్ పేర్కొన్నారు. ఈ నగదును మహా వికాస్ అఘాడీకి ఖర్చు పెట్టే అవకాశం ఉందని తెలిపారు. కిరణ్ లేవనెత్తిన అంశం జాతీయ మీడియాలో ప్రచురితం అయింది. ఈ వార్తలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.

ఈ అంశంపై కేటీఆర్ కూడా ఎక్స్ వేదికగా స్పందించారు. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ఏటీఎంగా మారిందని ధ్వజమెత్తారు. ఆర్ఆర్ ట్యాక్స్ నుంచి హర్యానా, మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాల ఎన్నికలకు నిధులు సమకూర్చుతున్నారని కేటీఆర్ ఆరోపించారు.